## క్లుప్తంగా

### చినముషిడివాడలో 'హర్ ఘర్ తిరంగా'



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో చినముషిడివాడలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. బుధవారం విద్యార్థులు వీధుల్లో త్రివర్ణ పతాకాలు చేతబూని 'భారత్ మాతాకీ జై'అంటూ నినాదాలు చేశారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు, బీజేపీ నేత చిక్కాల సతీష్ పాల్గొన్నారు.

### ఘనంగా నషా ముక్త్ భారత్ అభియాన్



ప్రతిజ్ఞ చేస్తున్న దేవస్థానం ఉద్యోగులు

సింహాచలం: భారతదేశాన్ని మాదక ద్రవ్య రహిత దేశంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సింహాచలం దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ పిలుపునిచ్చారు. దేవస్థానంలో బుధవారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాదవ ద్రవ్యాల నిర్మూలనపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈవోలు రమణమూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సింహాచలం దేవస్థానానికి చెందిన సంస్కృతోన్నత పాఠశాలలో విద్యార్థులు కూడా ప్రతిజ్ఞ చేశారు.

### డీఎంహెచ్‌వో సబ్బవరం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి

సబ్బవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న అనకాపల్లి జిల్లా సెంట్రల్ డ్రగ్స్ స్టోర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హైమావతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో నిల్వవున్న వ్యాక్సిన్లు, ఆస్పత్రి ఓపీని పరిశీలించారు. ఔట్ పేషెంట్ల తాకిడి నేపథ్యంలో డ్రగ్స్ స్టోర్‌కు అదనంగా ఓ సహాయకుడిని నియమిస్తామన్నారు. ఆమె వెంట వైద్యాధికారి డాక్టర్ ఆశ, డాక్టర్ విద్యాధరి, సిహెచ్‌వో స్వర్ణలత, ఫార్మసిస్ట్ ఈశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### అందరి సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణ



మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు అందరూ సహకరించాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు కోరారు. దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్‌కాలనీలో బుధవారం రాత్రి విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో స్థానికులతో ఆయన మాట్లాడారు. రాత్రుళ్లు జరుగుతున్న గంజాయి, మోసపూరిత నేరాలు, అసాంఘిక కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు.


### లండ కుటుంబానికి ఆర్థిక సాయం



డిపాజిట్ బాండ్ అందిస్తున్న సొసైటీ ప్రతినిధులు

సింహాచలం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అడవివరం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్, 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు లండ వెంకటరమణ కుటుంబానికి సొసైటీ పాలకవర్గం రూ.లక్షా 20 వేలు ఆర్థిక సాయం అందించింది. సంబంధిత డిపాజిట్ బాండ్‌ను వెంకటరమణ భార్యకు సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి బుధవారం అందించారు. ఆయన వెంట సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, డైరెక్టర్లు గునిశెట్టి శ్రీనివాసరావు, గొంతిన రామకృష్ణ, ఆకుల నాగరాజు, మజ్జి ధర్మరాజు తదితరులు ఉన్నారు.

### ● సే నో టు డ్రగ్స్



ప్రతిజ్ఞ చేస్తున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

'నషా ముక్త్ భారత్ అభియాన్'కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు 'సే నో టు డ్రగ్స్'ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల హెచ్‌వోడీలు, సిబ్బంది పాల్గొన్నారు. - పెందుర్తి

# అప్పన్న నిత్యాన్నదానం మహా ప్రసాదం

సింహగిరిపై నిత్యాన్నదాన పథకంలో సింహాచలం దేవస్థానం అందించే అన్నప్రసాదాన్ని భక్తులు మహాప్రసాదంగా భావిస్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్న అనంతరం అన్నప్రసాదం స్వీకరించే తిరుగుపయనం అవ్వాలని చాలా మంది భక్తులు తపిస్తుంటారు. ఇంతటి విశిష్టత కలిగిన అప్పన్న నిత్యాన్నదాన పథకం అమల్లోకి వచ్చి నేటి(ఆగస్టు 14)తో 36 వసంతాలు పూర్తిచేసుకుని 37వ వసంతంలోకి అడుగుపెడుతోంది.





అన్నప్రసాదాన్ని భక్తులకు వడ్డిస్తున్న సిబ్బంది

నేటితో 36 వసంతాలు పూర్తిచేసుకున్న సింహాచల దేవస్థానం నిత్యాన్నదాన పథకం

మార్చి 31 నాటికి రూ.36.45 కోట్లకు చేరిన డిపాజిట్లు

ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు మరో రూ.2.20 కోట్లు

సింహాచలం:

రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో సింహాచలం ఒకటి. ఇక్కడ కొలువైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు రోజూ దేశ విదేశాలకు చెందిన భక్తులు వస్తుంటారు. వీరిలో ఒడిశా, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల భక్తులే ఎక్కువ. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఉచితంగా అన్నప్రసాదాన్ని అందించాలని 1989 ఆగస్టు 14న నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభించారు. అప్పట్లో దేవస్థానంలో పనిచేసిన ఉద్యోగులే ఈ పథకానికి రూ.50 వేలు తొలి విరాళం అందించారు. అప్పటి నుంచి ఈ పథకానికి దాతల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

**రూ.38 కోట్లకు పైగా విరాళాలు**

2024–25 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి నిత్యాన్నదాన డిపాజిట్లు 36 కోట్ల 45 లక్షల 41 వేల 720 రూపాయలకు చేరుకున్నాయంటే అది భక్తులకు సింహాచలేశుడిపై ఉన్న అచంచల విశ్వాసమే..! ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు మరో రూ.2.20 కోట్ల డిపాజిట్లు వచ్చాయి. ఈ విరాళాలను బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, వాటిపై వచ్చే వడ్డీతో భక్తులకు నిత్యం దేవస్థానం అన్నప్రసాదం అందిస్తోంది.

**దాతలకు ప్రత్యేక ప్రాధాన్యత**

నిత్యాన్నదాన పథకానికి విరాళాలందించే దాతలకు ప్రత్యేక గుర్తింపు ఉటుంది. రూ.10,116 ఆపై విరాళం అందించే దాతలకు దేవస్థానం బాండ్లు అందిస్తుంది. ఆ రోజు పరిస్థితి ఆధారంగా స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పిస్తారు. దీంతోపాటు ఏడాదిలో వారు కోరుకున్న రోజున వారి పేరు మీద భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తారు. ఆ వివరాలను ఆ రోజు అన్నప్రసాద భవనం బోర్డులో పేర్కొంటారు.

రూ.10,116 లోపు వచ్చే విరాళాలను స్వల్ప విరాళాలుగా పరిగణిస్తారు. వాటిని ప్రొవిజన్స్, ఇతర ఖర్చులకు వెచ్చిస్తారు.

**రోజువారీ అన్నప్రసాదం**

సింహగిరిపై ఉన్న అన్నప్రసాద భవనంలో రోజూ ఉదయం 11.30కు వడ్డన ప్రారంభమవుతుంది. సోమ నుంచి శుక్రవారం వరకు రోజూ 2 వేలు నుంచి 3,500 మందికి, శనివారాలు 5–7 వేలు, ఆదివారం రోజుల్లో 4–6 వేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తారు. రోజూ రాత్రి పూట 200–500 మంది భక్తులకు కదంబం(ముక్కల పులుసు అన్నం) అందిస్తారు.

### రుచి చాలా బాగుంది



శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి దర్శనం బాగా జరిగింది. కుటుంబ సభ్యుల కోరికతో తొలిసారి అన్నప్రసాదం స్వీకరించా. రుచి బాగుంది. సాంబారు ఎంతో నచ్చింది. అన్నప్రసాదం రుచి ఎలా ఉందో భక్తుల అభిప్రాయాలు తీసుకోవడం బాగుంది.

– ఆర్.రావు, బిలాయ్

### మహా ప్రసాదంగా భావిస్తా..



సింహాచలేశుడి దర్శనానికి తరచూ వస్తుంటాను. అన్నదాన భవనంలో భోజనం తప్పకుండా చేస్తాను. మహా ప్రసాదంగా అనుకుంటాం. దాతల సహకారంతో సింహాచలం దేవస్థానం చేస్తున్న అన్నదానం ఎంతో గొప్ప కార్యక్రమంగా భావిస్తాను.

– మణి, విజయనగరం

### భక్తులకు నాణ్యమైన భోజనం



అన్నప్రసాదాన్ని భక్తులకు రుచిగా అందించేందుకు ఎప్పటికప్పుడు నాణ్యత పరిశీలిస్తాం. దీనిపై అధికారులకు ప్రత్యేక సూచనలిస్తాం. ఆఖరి పంక్తి వరకు భక్తులందరికీ ఒకే రకమైన నాణ్యమైన భోజనం అందిస్తున్నాం. దాతల ప్రోత్సాహం చాలా ఎక్కువ.

– వి.త్రినాథరావు, ఈవో, సింహాచలం దేవస్థానం

పథకం ప్రారంభం
ఆగస్టు 14, 1989

ఒక్కో భక్తుడికి భోజనం ఖర్చు రూ.35

ఏడాదికి డిపాజిట్లపై వచ్చే వడ్డీ రూ.2.20కోట్లు

స్వల్ప(రూ.10,116 లోపు) విరాళాలు ఏడాదికి రూ.1.80 కోట్లు

**విరాళాల వారీగా దాతల కేటగిరీ**

మహారాజ పోషకులు రూ.లక్ష ఆపై ఇచ్చే దాతలు

రాజపోషకులు రూ.50 వేలు దాటి ఇచ్చేవారు

పోషకులు రూ.10 వేలు ఆపై ఇచ్చేవారు

దాతలు రూ.1,116లు ఇచ్చిన వారు

(ఇప్పటి వరకు రూ.10 లక్షలకు పైగా విరాళం ఇచ్చిన వారు నలుగురుండగా, రూ.లక్ష ఆపై విరాళాలు అందించిన వారు 1,219 మంది ఉన్నారు.)



విరాళాలు అందిస్తున్న భక్తులు

### విరాళాల కౌంటర్లు

సింహగిరిపై మూడు చోట్ల విరాళాల కౌంటర్లున్నాయి. దర్శనం అనంతరం ఆలయం వెలుపలికి వచ్చే మార్గం, పీఆర్వో కార్యాలయంతో పాటు, అన్నప్రసాద భవనం వద్ద విరాళాలు అందించవచ్చు. విరాళాలకు సంబంధించి ఇతర వివరాలకు 9398734612 నంబర్లో సంప్రదించవచ్చు.

## వినియోగంలోకి సామాజిక మరుగుదొడ్లు



సాక్షి ఎఫెక్ట్..

వినియోగంలోకి వచ్చిన వాడచీపురుపల్లి సామాజిక మరుగు దొడ్లు

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామంలో ఏడాది నుంచి మూతపడిన సామాజిక మరుగుదొడ్లను ఎట్టకేలకు తెరిచారు. 'అత్యవసరమైతే అవస్థలే'శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ పాలకవర్గం స్పందించి చర్యలు చేపట్టింది. పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు చొరవతో మూత పడిన మరుగుదొడ్ల తెరవకోవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రజలకు మౌలిక సదుపాయల కల్పనలో భాగంగా సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం రూ.16.50 లక్షల వ్యయంతో 2021లో వాడచీపురుపల్లి పీహెచ్‌సీ సమీపంలో సామాజిక మరుగు దొడ్లను నిర్మించింది. ఏడాది క్రితం వరకు వీటి నిర్వహణ బాధ్యత తీసుకొన్న ఎన్టీపీసీ యాజమాన్యం ఆ బాధ్యతను గ్రామ పంచాయతీకి అప్పగించి, తప్పుకుంది. దీంతో ఏడాది నుంచి మరుగు దొడ్లు మూతపడ్డాయి. ఎట్టకేలకు వీటిని ప్రారంభించడంతో గ్రామీణ ప్రజల మరుగుదొడ్ల కష్టాలు గట్టెక్కాయి.

## ఎస్సీ, ఎస్టీల హక్కులపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

సింహాచలం: విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అడవివరంలోని ఆర్ ఆర్ కల్యాణమంపడంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం, బాల్య వివాహాలు, అకాల గర్భధారణలకు వ్యతిరేకంగా గిరిజన ప్రాంతాల్లో చైతన్య కార్యక్రమాలపై అవగాహన సదస్సు జరిగింది. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు చట్టపరమైన హక్కులు, నేరస్తులకు విధించే శిక్షలు, బాధితులకు అందించే న్యాయ సహాయం, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిమాణాలు, అకాల గర్భధారణలో ఎదురయ్యే ఆరోగ్యసమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ ధనలక్ష్మి, ఎస్ఐ రాజారావు, సింహాచలం గిరిజన సంఘం అధ్యక్షుడు రాజయ్య, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యుడు మర్రి సత్యనారాయణ, అడ్వకేట్ కరుణాకర్ పాల్గొన్నారు.

## తహసీల్దార్ వెంకట అప్పారావు బాధ్యతల స్వీకరణ

● డీటీ బాధ్యతలు స్వీకరించిన కిషోర్



పెందుర్తి నుంచి బదిలీఅయినసంతోష్‌కిరణ్‌కు వీడ్కోలు పలుకుతున్న తహసీల్దార్, వీఆర్వోలు

పెందుర్తి: దాదాపు రెండు నెలల తరువాత పెందుర్తి రెవెన్యూకు పూర్తిస్థాయి అధికారులు వచ్చారు. తహసీల్దార్‌గా ఇంటు వెంకట అప్పారావు, డిప్యూటీ తహసీల్దార్‌గా కిషోర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న ఎ.సంతోష్ కిరణ్ వెంకట అప్పారావుకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకంగా సేవలందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూములను సంరక్షించడమే తమ ప్రథమ కర్తవ్యం అన్నారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా నేరుగా తమను కలవొచ్చని పేర్కొన్నారు. ముందుగా పెందుర్తి నుంచి గాజువాక తహసీల్దార్‌గా బదిలీపై వెళుతున్న సంతోష్‌కిరణ్‌ను తహసీల్దార్, వీఆర్వోలు, సిబ్బంది ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు.

## ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. నరవలోని విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ర్యాగింగ్, మత్తు పదార్థాల వినియోగం-అనర్థాలు, మహిళల భద్రత తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు పరస్పర స్నేహభావంతో మెలగాలన్నారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా సే నో టు డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి ఆధారిత పంట ఉత్పత్తులతో ఆరోగ్యం



ఆర్గానిక్ ఆకు కూరలు, గుడ్డ సంచులను ప్రదర్శిస్తున్న గ్రీన్ క్లైమేట్ ప్రతినిధులు

పెందుర్తి: సహజ సిద్ధంగా పండే ప్రకృతి ఆధారిత పంటలనే ప్రతి ఒక్కరూ తీసుకోవాలని గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకుడు జేవీ రత్నం సూచించారు. రసాయనాలతో పండించిన పంటలు ఆరోగ్యానికి ఎంతో హానికరమని హెచ్చరించారు. చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్ అలివేలు మంగమ్మ ఆలయ ప్రాంగణంలో బుధవారం గ్రీన్ క్లైమేట్ బృందం నేతృత్వంలో తయారు చేసి గుడ్డ సంచులు, ఆర్గానిక్ ఆకుకూరలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన భావితరాల జీవనం ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించారు. స్థానికంగా పండే ఆకు కూరలు, కూరగాయలనే వినియోగించాలన్నారు. వనమాలి సీటీజీ ఏరియా ఇన్‌చార్జి రేఖ మాట్లాడుతూ ఇంటి పంటలు పండిస్తున్న వారికి వనమాలి గ్రూప్ తరఫున విత్తనాలు, నారు అందిస్తున్నామన్నారు. వనమాలి గ్రూప్ ఏరియా ఇన్‌చార్జి సత్యవతి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని పండించుకోవడంలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో కో ఆర్డినేటర్ రాజేశ్వరి, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక సంస్థ అనకాపల్లి ప్రతినిధి కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ్‌లో హౌస్ కెప్టెన్‌ల నియామకం



స్పోర్ట్స్ హౌస్ కెప్టెన్లతో కళాశాల సిబ్బంది

పెందుర్తి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో స్పోర్ట్స్ హౌస్ కెప్టెన్లను నియమించారు. బాలికలకు సైనా నెహ్వాల్ హౌస్, పీవీ సింధు హౌస్, మేరీ కామ్ హౌస్, ఝాన్సీరాణి హౌస్‌లుగా, బాలురకు నేతాజీ హౌస్, ఛత్రపతి శివాజీ హౌస్, అల్లూరి హౌస్, ఆజాద్ హౌస్‌గా విభజించి వాటికి నాయకులను ఎంపిక చేశారు. వీరిని కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఎస్.ఈ ఫ్లోరా, సిబ్బంది అభినందించారు.

## భూదేవి చెరువు గర్భంలోని చెట్ల వేలం ఖరారు

● పంచాయతీకి రూ.49.70 లక్షల ఆదాయం

సబ్బవరం: మండలంలోని అయ్యన్నపాలెం రెవెన్యూ పరిధి భూదేవి చెరువు గర్భంలోని సరుగుడు ఇతర చెట్లకు నిర్వహించిన వేలం పాటలో రూ.49.70 లక్షలకు పాట ఖరారయింది. పంచాయతీ కార్యాలయం వద్ద ఈవోపీఆర్డీ చైతన్య ఆధ్వర్యంలో బుధవారం బహిరంగ వేలం జరిపారు. రావికమతం మండలం తట్టబందకు చెందిన నరసింహనాయుడు అత్యధిక పాటకు చెట్లను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ వివిధ ప్రాంతాలకు చెందిన 105 మంది వేలం పాటలో పాల్గొన్నట్లు తెలిపారు. గతంలో రెండుసార్లు మర్రిపాలెం, ఎల్లుప్పికి చెందిన ఆయకట్టు రైతులు వేలంపాటను అడ్డుకోవడంతో, పటిష్ట పోలీస్ బందోబస్త్‌తో వేలంపాట నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుదిరెడ్డ లక్ష్మి, ఉప సర్పంచ్ బుదిరెడ్డ కనకరాజు, సీఐ జి.రామచంద్రరావు, చెరువు ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

## రేపు స్వచ్ఛంద రక్తదాన శిబిరం

పెందుర్తి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్ తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి పెందుర్తి కూడలిలోని సాయిరాం మెడికల్స్ ప్రాంగణంలో శిబిరం ఉంటుందన్నారు. రక్తదాతలు ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు.

## త్వరితగతిన మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి

● అధికారులతో వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్



గొల్లలపాలెంలో అధికారులతో మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెం-అమృతపురం మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఆదేశించారు. బుధవారం ఆయన గొల్లలపాలెం, గాలిభీమవరం, నల్లరేగులపాలెం తదితర గ్రామాల్ల పర్యటించారు. పెదముషిడివాడ-దువ్వాడ వయా గంగవరం మీదుగా చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల ప్రగతిని ఆరా తీశారు. గాలిభీమవరంలో అభివృద్ధి చేసి రైతులకు ఇచ్చిన ఆర్‌సీసీ ప్లాట్లను, నల్లరేగులపాలెంలో ల్యాండ్‌పూలింగ్‌లో సేకరించనున్న భూముల్ని పరిశీలించారు. రైతులకు ఇచ్చిన ఆర్‌సీసీ ప్లాట్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, అప్పగించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఈ భవానీశంకర్, ఎస్టేట్ ఆఫీసర్ దయానిధి, వీఎంఆర్‌డీఏ సర్వేయర్ స్నేహ, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ అప్పారావు, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, సచివాలయ సర్వేయర్ లోకేష్ తదితరులు ఉన్నారు.

## ప్రత్యామ్నాయ ఉపాధికై ఆటో కార్మికుల ఆందోళన




లంకెలపాలెంలో నిరసనలో ఆటో కార్మికులు

పరవాడ: ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిటు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సిటు ఆధ్వర్యంలో లంకెలపాలెం కూడలిలో ఆటో కార్మికులు బుధవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి కల్పించకపోయినా అనేక మంది ఆటో డ్రైవర్లు ఫైనాన్స్, బ్యాంకుల్లో అప్పులు తీసుకుని ఆటోలు కొనుగోలు చేసి, వాటి ద్వారా వస్తున్న తక్కువ ఆదాయం నుంచే ఫైనాన్స్ కిస్తీలు చెల్లించుకుంటూ, కుటుంబాలను పోషించుకుంటున్నారని పేర్కొన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే ఆటోలకు బేరాలు తగ్గి, ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఎన్నికల్లో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో కార్మికుడికి వాహనమిత్ర పథకం కింద ఏడాదికి రూ.25 వేలు మంజూరు చేసి, ఆదుకోవాలన్నారు. నిరసన కార్యక్రమంలో సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, సముద్రాలు, రాంబాబు, రాము, బాబూరావు, శ్రీను పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ అమలుకు చర్యలు



మాట్లాడుతున్న డీఏవో అప్పలస్వామి

పెందుర్తి: అన్నదాత సుఖీభవ పథకం క్షేత్రస్థాయిలో అమలుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.అప్పలస్వామి అన్నారు. అర్హత ఉన్నా చాలా మంది పేర్లు లేవని వినతులు వస్తున్నందున ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. పథకం అమలులో రెవెన్యూ పరమైన ఇబ్బందులపై స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతుల భూములు ఆన్‌లైన్, డిజిటల్ సైన్ వంటి సమస్యలను వారి అర్హతలు, హక్కులు, వివాదరహితమైన భూములుగా నిర్ధారణ తర్వాత త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ ఐ.వెంకట అప్పారావు, డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, మండల వ్యవసాయాధికారి చంద్రవతి, ఏఈవో రమణ పాల్గొన్నారు.

## టిడ్కో కాలనీలో రక్షణ చర్యలకు వినతి

పరవాడ: స్థానిక టిడ్కో గృహ సముదాయంలో చోరీల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు మన్యాల బంగారమ్మ, అన్నపూర్ణలు పరవాడ పోలీసులను కోరారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం ఆధ్వర్యంలో ఎస్ఐ మహాలక్ష్మికి బుధవారం వినతిపత్రం అందించారు. టిడ్కో కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి గంజాయి, మత్తు పదార్థాలు సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటమే కాకుండా, రాత్రి వేళ ఇళ్లలో చొరబడి సెల్‌ఫోన్లు, బైక్‌లు చోరీ చేస్తున్నారని పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో అరుణ, వరలక్ష్మి, లక్ష్మి, బేగం ఉన్నారు.

## సస్యరక్షణ చర్యలతో చీడపీడల నివారణ



రాంపురంలో పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

పెందుర్తి: రైతులు సకాలంలో తగు సస్య రక్షణ చర్యలు చేపడితే పంటల చీడపీడల నివారణ సాధ్యమవుతుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.అప్పలస్వామి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం రాంపురంలో వ్యవసాయ శాఖ అధికారులు, అనకాపల్లి చెరకు ఫాం(ఆర్ఏఆర్ఎస్) శాస్త్రవేత్తలు పర్యటించారు. వరి నారు మడుల్లో ఇనుము ధాతు లోపాన్ని గుర్తించారు. దీని నివారణకు అన్నబేధి, నిమ్మఉప్పు కలిపి పిచికారి చేస్తే ఫలితం ఉంటుందన్నారు. వరినాట్లు వేసిన మడులను పరిశీలించి వాటి లోపాలను చెప్పారు. వాటి నివారణకు తొలి విడతలోనే యూరియా, పొటాష్ కలిపి వేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కలిగించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు సరిత, గౌరీ, రామలక్ష్మి, మండల వ్యవసాయాధికారి చంద్రవతి, వీఏవో గాయత్రి, ఏఈవో రమణ తదితరులు పాల్గొన్నారు.